

సమాజంలో మార్పు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం అహరహం శ్రమించడమే శ్రేష్ఠమైన ధర్మం.'


# Dr.PRK పవర్

పోరాడితే పోయెదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప








సంపుటి : 01 సంచిక : 336 | సోమవారం 7 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# తుక్కుగూడలో నర్సు హత్యాచార ఘటనపై సీఎం రేవంత్ సంచలన నిర్ణయం

హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్ లో ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏమైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అన్న అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు.

ఈ కేసులో నిందితుడిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు.

ఈ కేసులో బాధిత మిగతా 2లో





## 2040 వరకు తెలంగాణలో
# కాంగ్రెస్‌దే అధికారం

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన మధ్య తేడాపై చర్చకు సిద్ధమన్న మహేశ్ గౌడ్

### కేటీఆర్ సోషల్ మీడియాలో క్షణికానందం పొందుతున్నారని ఎద్దేవా

### తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని వ్యాఖ్య

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ ..మిగతా 2లో

## సామాజిక సేవ, రాజకీయాల్లో ఆదర్శంగా నిలుస్తున్న
# డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

(హనుమకొండ -- పవర్):

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో వైద్య సేవలతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, పవర్ న్యూస్ ఛైర్మన్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. వైద్య నిపుణుడిగా, సామాజిక వేత్తగా మరియు రాజకీయ నాయకుడిగా ఆయన చేపట్టిన పలు కార్యక్రమాల వివరాలు:

**ఉచిత వైద్య శిబిరాలు -- ఆరోగ్య అవగాహన**

రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో నిరుపేదల కోసం నిరంతరం ఉచిత ఫిజియోథెరపీ, న్యూరో కేర్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. పక్షవాతం, కీళ్ల నొప్పులు మరియు వెన్నుపాము సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి, మందులు మరియు పునరావాస పరికరాలను అందజేస్తున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, శారీరక శ్రమ చేసే కార్మికులకు శరీర భంగిమ (పోస్చర్) మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**పక్షవాత బాధితులకు పునరావాస సేవలు:**



వరంగల్‌లోని రామకృష్ణ హాస్పిటల్స్ వేదికగా అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఫిజియోథెరపీ పరికరాలను అందుబాటులోకి తెచ్చి, పక్షవాతం వల్ల చలనశీలత కోల్పోయిన వందలాది మంది రోగులు తిరిగి స్వతంత్రంగా నడిచేలా శ్రమించారు. ఆర్థిక స్తోమత లేని పేద రోగులకు ప్రత్యేక రాయితీలతో మరియు ఉచితంగా చికిత్స అందిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

**ఎంబిసి, ఎస్సీ మరియు బలహీన వర్గాల సంక్షేమం:**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, దళిత మరియు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రుణ వసతులు మరియు ఉపాధి అవకాశాలు అర్హులైన పేదలకు అందేలా చూసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నియోజకవర్గ స్థాయిలో పాదయాత్రలు, ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

**ఇంటి వద్దకే వైద్య సేవలు:**

ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందే పరిస్థితి లేని తీవ్ర పక్షవాత బాధితులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లేలా గృహ ఫిజియోథెరపీ (హోమ్ కేర్) సేవలను అందుబాటులోకి తెచ్చి ఎంతోమంది బాధితులకు, వారి కుటుంబాలకు కొండంత భరోసానిచ్చారు.

**యువతకు మార్గదర్శకత్వం:**

ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన యువ వైద్యులకు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం ఇస్తూ వృత్తిపరంగా వారు స్థిరపడేందుకు సహాయం అందిస్తున్నారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఫిజియోథెరపీ వృత్తి నైపుణ్యాల పెంపునకు మరియు వైద్యుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నారు.



## తెలంగాణలో 369
# ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు

### టెండర్లకు టీజీ రెడ్కో ఆహ్వానం

### 200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు

### టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 169 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు -

### ఆరు క్లస్టర్లలో 200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత పెంచడంతో చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లను (సీపీఓలు) ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటనను జారీ చేసింది. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి ..మిగతా 2లో

## 2029 నాటికి డ్రగ్స్ రహిత
# భారతదేశమే లక్ష్యం

### డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం: అమిత్ షా




న్యూఢిల్లీ, పవర్ న్యూస్

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు.

"2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు ..మిగతా 2లో

## దిశానిర్దేశం కోల్పోయిన
# బీఆర్ఎస్ నాయకత్వం

### ధర్నాలు మాని అసెంబ్లీకి రండి

### సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం: శ్రీధర్‌బాబు

### బీఆర్ఎస్ నాయకత్వం దిశానిర్దేశం కోల్పోయిందన్న శ్రీధర్ బాబు

### ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని వెల్లడి

### బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శ

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయ కత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ..మిగతా 2లో



# తెలంగాణలో 369 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు

మొదటి పేజీ తరువాయి...

అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న విద్యుత్తు వాహనాల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళిక చేసింది. దీర్ఘకాలికంగా, వాణిజ్యపరంగా నిలకడైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే టీజీ రెడ్కో ముఖ్య లక్ష్యం అని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ పేర్కొన్నారు.

10 సంవత్సరాలపాటు కాంట్రాక్ట్ : హైదరాబాద్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీఓలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10



సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లో 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నామని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు.

టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 : ఎంపికైన సీపీఓలు సర్వే, డిజైన్, సరఫరా, సివిల్ వర్క్స్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్‌తో పాటు 10 సంవత్సరాల పాటు ఆపరేషన్, మెయింటెనెన్స్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పీఎం ఈ డ్రైవ్ పథకంలో భాగంగా అర్హులైన బిడ్డర్‌కు నిబంధనలకు లోబడి సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (+టూ అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రూ.169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ ఈనెల 08 నుంచి ప్రారంభమై 22న ముగుస్తుందని అన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.





## కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (KUDA) మాజీ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సతిమణి శాలిని

(హనుమకొండ -- పవర్):

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కూడా) మాజీ చైర్మన్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (ఐజజ) అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పవర్ న్యూస్ చైర్మన్, రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, వారి సతిమణి శాలిని గారి ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కేక్ కట్ చేయించి, ఆయనకు జ్ఞాపికగా ప్రత్యేక ఫోటో



ఫ్రేమ్‌ను అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రజాసేవలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల కార్యక్రమంలో పొన్నం మహేష్ గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు.

పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్‌ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు.

"మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్‌ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో




పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల షా స్పష్టం చేశారు.

పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి

## తుక్కుగూడలో నర్సు హత్యాచార ఘటనపై సీఎం రేవంత్ సంచలననిర్ణయం

మొదటిపేజీ తరువాయి

కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్టాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం జరక్కుండా చూడాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్రక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### అసలేం జరిగిందంటే..?

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రైమ్ కేర్ దవాఖాన షెల్టర్ రూమ్లో ఓనర్సును ఓ కిరాతకుడు అత్యంత పాశవికంగా చంపేశాడు. హాస్పిటల్ రూమ్లో స్నేహితురాలితో కలిసి ఉంటున్న యువతి అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న సమయం చూసి రూమ్లోకి ప్రవేశించాడు. ఆమె ప్రతిఘటించడంతో రాడ్తో ముఖంపై చితకబాదాడు. ఆ తర్వాత లైంగికదాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరగ్గా.. పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఓ యువతి(21) ఏడు నెలలుగా తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ దవాఖానలో నర్సుగా పని చేస్తోంది. ఆ హాస్పిటలిబిల్డింగ్ కింది రూమ్లోనే ఓ బైక్మెకానిక్ షాపు ఉంది. దాని పక్క సందు నుంచే నర్సులకు కేటాయించిన రూమ్లకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే, శనివారం మధ్యాహ్నం ఆమె డ్యూటీకి రాకపోవడంతో తోటి సిబ్బంది గదికి వెళ్లి తలుపులు కొట్టారు. లోపల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూడగా ముఖంపై తీవ్ర గాయాలతో, రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పహాడీషరీఫ్ పోలీసులు డాగ్, క్లూస్ టీమ్తో వచ్చి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. పంక్చర్ లివర్తో ముఖంపై బలంగా కొట్టి హతమార్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కాళ్లపై కూడా తీవ్ర గాయాలున్నాయి. బాధితురాలి దుస్తులు, శరీరంపై ఉన్న గాయాలను బట్టి లైంగిక దాడి జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. డెడ్బాడీని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

### కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించి..

బిహార్ లోని బేగుసరాయ్ జిల్లా బచ్వారా మండలం రుదౌలి గ్రామానికి చెందిన మహ్మద్ సదావుల్లా(34) తుక్కుగూడ వద్ద ప్రైమ్ కేర్ హాస్పిటల్ ఆవరణలోని షాపులో బైక్ మెకానిక్గా పని చేస్తున్నాడు. హాస్టల్పక్కనే షాపు ఉండడంతో కొద్ది రోజులుగా యువతి వచ్చే టైం, వెళ్లే టైం గమనిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆమె తన రూమ్లో ఒంటరిగా ఉందని, పక్కన రూముల్లో కూడా ఎవరూ లేరని తెలుసుకున్నాడు. తర్వాత కిటికీ ద్వారా ఆమె రూమ్లోకి ప్రవేశించాడు. అలికిడి విన్న ఆమె కళ్లు తెరిచి చూసే సరికి ఎవరో లోపలకు రావడం కనిపించింది. దీంతో అరవబోయింది. వెంటనే ఆమె నోరు మూసిన నిందితుడు అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో రాడ్తో ఆమె ముఖంపై చితకబాదాడు. ఆమె స్పృహ కోల్పోవడంతో లైంగికదాడి చేశాడు. తర్వాత గొంతు నులిమి చంపేసి అక్కడి నుంచి పరారయ్యాడు.

### వీడియో కాల్ మాట్లాడిన గంటల్లోనే

యువతి తండ్రి చనిపోవడంతో తల్లి కూలి పనులు చేసుకుంటూ ఆమెతో పాటు మరో కొడుకును పోషిస్తోంది. ఘటన జరిగిన రోజు రాత్రి 10.30 గంటల వరకు కుటుంబసభ్యులతో అమె వీడియో కాల్లో మాట్లాడింది. తాను బాగానే ఉన్నానని, తల్లి, సోదరుడు ఎలా ఉన్నారని కుశల ప్రశ్నలు వేసింది. శనివారం తనకు మధ్యాహ్నం డ్యూటీ ఉందని చెప్పింది. ఇక నిద్ర వస్తోందని పడుకుంటానని ఫోన్పెట్టేసింది. ఆమె పడుకున్న కొద్ది గంటల్లోనే నిందితుడు ఆమె రూమ్లోకి ప్రవేశించి లైంగికదాడి చేసి ప్రాణాలు తీశాడు.

## 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

మొదటి పేజీ తరువాయి...

చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

## దిశానిర్దేశం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకత్వం

మొదటి పేజీ తరువాయి...

మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు.

# ఎంజేపీ గురుకుల ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారాలు

వరంగల్, పవర్:

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు విశేష సేవలందించిన పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ గౌరవం దక్కింది.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు.



## అవార్డు గ్రహీతలు:

మడగాని సరిత: ప్రిన్సిపాల్ గ్రేడ్-1, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, వర్ధన్నపేట

అచ్చ రవీందర్: తెలుగు జూనియర్ లెక్చరర్, ఎంజేపీ బాలుర జూనియర్ కళాశాల, సంగెం

బి. సంగీత: క్రాఫ్ట్ టీచర్, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, వర్ధన్నపేట

సొసైటీ సెక్రటరీ బి. సైదులు ఐపీఎస్ అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతోనే ఈ ఘనత సాధ్యమైందని అవార్డు గ్రహీతలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, సెక్రటరీ సైదులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆర్సీవో శ్రావణ్ కుమార్ తదితరులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డులు సాధించిన ఉపాధ్యాయులను పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి సిబ్బంది అభినందించారు.

# 123 మందికి రూ.32.40 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ -- పవర్):



పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32,40,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... అనారోగ్యంతో చికిత్స పొందిన కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ -- పవర్):



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటం ఎంతో సంతోషంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. 54వ డివిజన్ పోచమ్మకుంటలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు పోచమ్మ బోనాల సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... పోచమ్మకుంట ప్రాంతం తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే కమ్యూనిటీ భవన్ నిర్మాణం, ఆలయ అభివృద్ధి, అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని వెల్లడించారు. అలాగే పోచమ్మకుంట శ్మశానవాటికను ఆధునికంగా, ఆహ్లాదకరమైన గార్డెన్ తరహాలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పోచమ్మకుంటను దత్తత తీసుకుని అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.

?ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు.

?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

(ఆత్మకూర్ -- పవర్):



పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం లింగమడుగుపల్లి, కామారం, గూడెప్పాడ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులను శాలువాలతో సత్కరించి, వారి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.

?అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. పేదల కళ్లలో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలే లేవని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 48, 49 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



(కాజీపేట -- పవర్):

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48, 49 డివిజన్లలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న రేణుక ఎల్లమ్మ దేవాలయం, శివాలయం అభివృద్ధితో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పన పనులకు ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యుజీడీ) పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టవద్దని సూచించారు. రోడ్లు నిర్మించిన వెంటనే డ్రైనేజీ కోసం మళ్లీ తవ్వడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అవ్వడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 6 వేల కోట్ల రూపాయల వ్యయంతో వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఆధునీకరణ చేపడుతోందని వెల్లడించారు. ఈ పనుల దృష్ట్యా ప్రజలు మరో నాలుగు నెలల పాటు సహకరించాలని కోరారు.

అనంతరం 48, 49 డివిజన్ల ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

(హనుమకొండ - పవర్)

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ పరిధిలోని కీర్తి నగర్‌కు చెందిన కంచె చేరాలు, నంద రమేష్, కంచె రమేష్, పోతారాజు రాములు, గౌడ రాజకోమురయ్య, కోరే రవీందర్, సంపత్, సుమన్, అశోక్, సుభాష్, రాజేందర్, సతీష్, మనోహర్‌తో సహా దాదాపు 20 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతోందని, పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ కొండేటి కొమురు రెడ్డి, 16వ డివిజన్ అధ్యక్షుడు ఎండి జానీ, 15వ డివిజన్ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జులైవాడ పోచమ్మ బోనాల ఉత్సవాలు:

### పాల్గొన్న అనుగుల రాకేష్ రెడ్డి

(హనుమకొండ -- పవర్):





పోచమ్మ తల్లి ఆశీస్సులతో ఓరుగల్లు ప్రజలంతా సుఖసంతోషా లతో, ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని బీజేపీ నాయకులు అనుగుల రాకేష్ రెడ్డి ఆకాంక్షించారు. హనుమకొండ జులైవాడలో నిర్వహించిన శ్రావణమాస పోచమ్మ బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ 50వ డివిజన్ నాయకులు అంకం లక్ష్మణ్ ఆహ్వానం మేరకు ఆయన పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయం అంటే కేవలం విమర్శలు, ప్రతి విమర్శలు, ధర్నాలు, రాస్తారోకోలు మాత్రమే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం కూడా ప్రజా జీవితంలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. 50వ డివిజన్‌లో గత కొన్నేళ్లుగా అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చేరువగా ఉంటున్న బీఆర్ఎస్ నాయకులు అంకం లక్ష్మణ్‌ను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.ఇదే స్ఫూర్తితో అమ్మవారి ఆశీస్సులతో మరిన్ని సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉండాలని సూచించారు. పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ఓరుగల్లు ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాఘవపురంలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

(స్టేషన్ ఘనపూర్ -- పవర్):



స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవపురం గ్రామంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన స్థలాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు శ్రీ కడియం శ్రీహరి ఆదివారం పరిశీలించారు. అగ్నిప్రమాదంలో పిల్లల విద్యా సర్టిఫికెట్లు, బట్టలు, నిత్యవసరాలు, నగదు పూర్తిగా కాలిపోయాయని బాధితులు ఎమ్మెల్యే ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితులను ఓదార్చి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. తక్షణ సహాయంగా ఆర్థిక సాయం అందించడంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాలు వెంటనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా కూడా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ (మాల) కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 రోజుల్లో నిధులు మంజూరు చేయిస్తానని, 3 నెలల్లో నిర్మాణం పూర్తయ్యేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాలూకుంటల శిరీష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

### ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

(జనగామ -- పవర్):

విద్యార్థులకు ఎలాంటి అంతరాలు లేని నాణ్యమైన విద్యను అందించినప్పుడే అసమానతలు లేని సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు శ్రీ కడియం శ్రీహరి అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు విద్యా ప్రమాణాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో ఉపాధ్యాయులు తమవంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు.భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురుపూజోత్సవం - జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సందీప్ కుమార్ ఝూతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా గురువులను కీర్తిస్తూ ప్రార్థనా గీతం ఆలపించిన అనంతరం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... సమాజంలో అత్యంత గౌరవప్రదంగా చూసేది ఉపాధ్యాయులను మాత్రమేనని అన్నారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటూ మారుతున్న ప్రమాణాలకు అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. విద్యారంగంలో అసమానతలు



రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ఉపాధ్యాయులపై ఉందన్నారు.సమర్థవంతమైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నప్పటికీ, విద్యార్థుల ప్రవేశాలు అనుకున్న స్థాయిలో ఉండకపోవడంపై ప్రతీ ఉపాధ్యాయుడు పాఠశాలలను స్వంతం చేసుకుని అభివృద్ధి పరచాలని కోరారు. తల్లిదండ్రులకు నాణ్యమైన విద్యపై భరోసా కల్పించాలని, పడిపోతున్న విద్యా ప్రమాణాలకు అందరం బాధ్యులమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పాఠశాల ఆవరణలోకి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు రాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ?అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాలువాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి బోనాల పాలారం బండి ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(కాజీపేట -- పవర్):

మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా కాజీపేటలో నిర్వహించిన పాలారం బండి కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు.

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రత్యేక గుర్తింపు అని కొనియాడారు. యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని మన ఆచార వ్యవహారాలను, సంస్కృతిని కాపాడుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. మన పండుగలు, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# మంత్రి పదవి రేసులో యశస్విని రెడ్డి..?

(పాలకుర్తి -- పవర్):
తెలంగాణ మంత్రివర్గంలో చోటు కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మంత్రి పదవి పొందేందుకు అనేక మంది సీనియర్, యువ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పేరు కూడా మంత్రి పదవి రేసులో బలంగా వినిపిస్తుండటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ముందంజలో యశస్విని రెడ్డి..?**
యువ ఎమ్మెల్యేగా పాలకుర్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యశస్విని రెడ్డి, గత శాసనసభ ఎన్నికల్లో సీనియర్ నాయకులను ఓడించి సంచలన విజయం సాధించారు. కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఆమె, తక్కువ సమయంలోనే శాసనసభ్యురాలిగా తనదైన ముద్ర వేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారంలో నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

**క్షేత్ర స్థాయిలో ప్రజాదరణ:**
ఎన్నికల అనంతరం రాజకీయాంగా పలు సవాళ్లు ఎదురైనప్పటికీ, నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడటంలో ముందంజలో ఉన్నారు. ఈ క్రమంలో యశస్విని రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తే పార్టీకి, ప్రభుత్వానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రాతినిధ్యం పెరగడంతో పాటు యువతకు పెద్దపీట వేసినట్లవుతుందని చర్చ జరుగుతోంది.



**సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు:**
మంత్రివర్గ విస్తరణలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు అత్యంత కీలకం కానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్లు ఉన్నప్పటికీ, యువతకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనలో అధిష్ఠానం ఉంటే యశస్విని రెడ్డికి అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. మహిళా కోటా, యువ నాయకత్వం, నియోజకవర్గంలో ఉన్న సీనియర్ నాయకుల మద్దతు కూడా ఆమెకు కలిసివచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి.

**అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ:**
యశస్విని రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందా లేదా అనేది కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయంలో ఈ అంశంపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. అధిష్ఠానం యువ ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తుందా? లేక సీనియర్ల వైపే మొగ్గు చూపుతుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.



## కార్యకర్తల ప్రేమాభిమానాలే నా బలం





### హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

(హన్మకొండ -ఆత్మకూర్ -గీసుకొండ - పరకాల -- పవర్):
కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలే తన బలమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. తన 58వ జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాల నియోజకవర్గంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో గీసుకొండ మండలంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో భారీ రక్తదాన శిబిరం మరియు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి 320 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున టీ షర్టులు, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ధ్రువపత్రాలను అందజేశారు. పరకాల, ఆత్మకూరు, ఊకల్‌లతో పాటు హనుమకొండలోని రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు.
?ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ... రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి ఇది ఎంతో ప్రాణాధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, ప్రతి ఒక్కరినీ కలుపుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని వెల్లడించారు. తన జన్మదినం సందర్భంగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇనగాల అవంతి వెంకట్రామ్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు, డాక్టర్ లక్ష్మీ స్వరణ్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ జార్జిన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేద దళిత కుటుంబాల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

వరంగల్, సెప్టెంబర్ 6 ( పవర్ న్యూస్):
పేద దళిత కుటుంబాల ఆర్థిక అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గీసుకొండ మండలంలోని కోనాయమాకుల రైతు వేదికలో ఆదివారం గీసుగొండ, సంగెం, 15, 16,17 డివిజన్ల కు చెందిన 334 దళిత కుటుంబాల లబ్ధిదారులకు పాడి గేదెల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పాడి గేదెల పెంపకం ద్వారా లబ్ధిదారులు వాటిని కాపాడి అత్యధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. లబ్ధిదారులు పాడి గేదెలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం ద్వారా అవి మరింత పాలను ఇస్తాయని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత కుటుంబాలకు పాడి గేదెలను అందించడం ద్వారా దళితులు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ, సంగెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దాడి శివ, ఇండ్ల రవికుమార్, మాజీ మండల అధ్యక్షులు చొల్లేటి మాధవరెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ పసునూరి భాస్కర్,ఎస్సీ కార్పొరేషన్ ఏడి, అధికారులు, గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కూడా చైర్మన్ గుండు సుధారాణి చేతుల మీదుగా “పద్మశాలి సేవా పురస్కార్” అవార్డు ప్రదానం

(హనుమకొండ -- పవర్):
హనుమకొండలోని ఎస్వీఎస్ కాలేజీ క్యాంపస్‌లో స్వరాజ్ న్యూస్ అధినేత పులికంటి రాజేందర్ ఆధ్వర్యంలో నేతన్న టీవీ రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుడా (ఖఖణూ) చైర్మన్ గుండు సుధారాణి, ఎస్వీఎస్ విద్యాసంస్థల అధినేత ఎర్రబెల్లి తిరుమలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ మరియు తౌటం రవీందర్‌లు పద్మశాలి సమాజానికి, ప్రజలకు అందిస్తున్న విశేష సేవలకు గాను కూడా చైర్మన్ గుండు సుధారాణి చేతుల మీదుగా “పద్మశాలి సేవా పురస్కార్” అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు పద్మశాలీలకు కూడా ఈ వేదికపై పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు.?ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షులు కామర్థపు మురళి, ఈగ మల్లేశం, వద్నాల నరేందర్, బచ్చు ఆనందం, వైద్యం రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




## వాతావరణ మార్పులపై సరిహద్దులు దాటి పోరాడాలి: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



(తింపూ -- పవర్):
తేదీ: **06-09-2026** (భూటాన్ దేశం, తింపూ రాజధాని)
వాతావరణ మార్పులు ప్రపంచానికి పెను సవాలుగా మారుతున్న నేపథ్యంలో దక్షిణాసియా దేశాలు సరిహద్దులను దాటి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. భూటాన్ లో సౌత్ ఏషియా పార్లమెంటరీ సదస్సులో ఆమె పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... సుస్థిర భవిష్యత్ కోసం దక్షిణాసియా దేశాలు సమష్టిగా కదలాలని కోరారు. ఆర్థికాభివృద్ధితో పాటు ప్రకృతి వనరులను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదు అని, ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించడమే నిజమైన సుస్థిర అభివృద్ధి అని స్పష్టం చేశారు.
పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం ఒక్క దేశం బాధ్యత కాదని, భవిష్యత్ తరాల కోసం ప్రాంతీయ సహకారంతో సమగ్ర పరిష్కారాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు.

## పోలీస్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న యువతకు సువర్ణావకాశం: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



(భూపాలపల్లి -- పవర్):
జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా యువత కోసం ఉచిత డే స్కాలర్ శిక్షణను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అభ్యర్థులకు శారీరక పరీక్షలు నిర్వహించగా, జిల్లావ్యాప్తంగా సుమారు **350** మంది అభ్యర్థులు ఉత్సాహంగా హాజరయ్యారు.అనంతరం సింగరేణి హైస్కూల్‌లో అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పరీక్షా కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం అభ్యర్థులతో మాట్లాడుతూ... యువత ఎంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి, జిల్లా పోలీస్ యంత్రాంగం కల్పిస్తున్న ఈ ఉచిత శిక్షణా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత డే స్కాలర్ క్లాసులతో పాటు **70** రోజుల పాటు గ్రౌండ్ కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. యువత కష్టపడి చదివి, శారీరకంగా సిద్ధమై పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆకాంక్షించారు.

## అంధకారంలో ఎస్సీ కొత్త కాలనీ: రాత్రి వేళల్లో రాకపోకలకు వీధి దీపాల తిప్పలు

(గూడెప్పాడ్ -- పవర్):



గూడెప్పాడ్ మార్కెట్ రోడ్‌లోని ఎస్సీ కొత్త కాలనీ వీధుల్లో వీధి దీపాలు లేకపోవడంతో కాలనీవాసులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
కాలనీ వీధుల్లో ఎక్కడా సరైన దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఆ ప్రాంతమంతా అంధకారమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనివల్ల కాలనీకి చెందిన మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు ఉద్యోగులు రాత్రి సమయాల్లో వీధుల్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు, అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గూడెప్పాడ్ మార్కెట్ రోడ్ ఎస్సీ కొత్త కాలనీ వీధుల్లో వీధి దీపాలను ఏర్పాటు చేసి, తమ కాలనీవాసులకు రక్షణ కల్పించాలని పరికి దేవేందర్ మరియు కాలనీవాసులు కోరుతున్నారు.

## హైదరాబాద్‌లో సామూహిక శ్రీమంతాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



(హైదరాబాద్ -- పవర్):
హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక శ్రీమంతాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాలు నిర్వహించి, వారి ఆరోగ్యం, సుఖసంతోషాలు, క్షేమం కోసం ఆశీర్వాదాలు అందించారు. తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, గర్భిణీలకు పండ్లు, చీరలు, తాంబూలాలు మరియు అవసరమైన కానుకలను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషకాహారం మరియు భద్రమైన ప్రసవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి సామూహిక శ్రీమంతాల కార్యక్రమాలు గర్భిణీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీ మహిళలు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.